ఐపిఎస్‌లను కేటాయించండి

- ఉమ్మడి ఆస్తుల విభజనకు సహకరించండి
- మెట్రో రెండో దశ, మూసీ ప్రక్షాళనకు నిధులివ్వండి
- పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా
- కేంద్ర మంత్రులకు సిఎం రేవంత్ రెడ్డి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రానికి అదనంగా ఐపిఎస్ అధికారులను కేటాయించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు కేవలం 76 మంది ఐపిఎస్ అధికారులను కేటాయించారని తెలిపారు. జిల్లాల విభజన, వివిధ శాఖల పర్యవేక్షణ నిమిత్తం రాష్ట్రానికి అదనంగా 29 అదనపు ఐపిఎస్ పోస్టులు కేటాయించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తికి కేంద్ర మంత్రి అమిత్ షా సానుకూలంగా స్పందించారు. 2024లో కొత్తగా వచ్చే ఐపిఎస్ బ్యాచ్ నుంచి తెలంగాణకు అధికారులను అదనంగా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులతో కలిసి గురువారం ఢిల్లీ వెళ్లిన సిఎం..పలువురు మంత్రులను కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలను పరిష్కరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన పలు అంశాలను అమిత్ షా దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. రాష్ట్ర పునర్విభజన చట్టం తొమ్మిదో షెడ్యూల్‌లో పేర్కొన్న సంస్థల విభజనను పూర్తి చేయాలని, పదో షెడ్యూల్ పరిధిలోని సంస్థల వివాదాన్ని పరిష్కరించాలని, న్యూఢిల్లీలోని ఉమ్మడి ఎపి భవన్ విభజనను సాఫీగా పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొనని సంస్థలను ఆంధ్రప్రదేశ్ క్లెయిమ్ చేసుకోవడంపై దృష్టి సారించాలని అమిత్ షాకు సిఎం విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో బలోపేతానికి రూ.88 కోట్లు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో బలోపేతానికి రూ.90 కోట్లు అదనంగా కేటాయించాలని సిఎం కోరారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్, హైకోర్టు భవనం, లోకాయుక్త, ఎస్‌హెచ్‌ఆర్‌సి వంటి భవనాలను వినియోగించుకున్నందున ఆ రాష్ట్రం నుంచి వడ్డీతో కలిపి మొత్తం రూ.408 కోట్లు ఇప్పించాలని అమిత్ షాకు విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ మెట్రో రెండో దశ సవరించిన ప్రతిపాదనలు ఆమోదించాలని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజప్తి చేశారు. హైదరాబాద్ మెట్రో రెండో దశను (బీహెచ్ఈఎల్-లక్డీకాపూల్, నాగోల్-ఎల్బీ నగర్, 26 కి.మీ., రూ.9,100 కోట్ల అంచనా వ్యయం), (విమానాశ్రయం మెట్రో కారిడార్- రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 32 కి.మీ, రూ.6,250 కోట్ల అంచనా వ్యయం) సవరించాల్సి ఉందని తెలిపారు. సవరించిన ప్రతిపాదనల ప్రకారం ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టే విషయాన్ని పరిగణించాలని కేంద్ర మంత్రిని కోరారు. హైదరాబాద్‌లోని మూసీ రివర్ ఫ్రంట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని, అమ్యూజ్‌మెంట్ పార్కులు, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్స్ వాటర్ స్పోర్ట్స్, బిజినెస్ ఏరియా, దుకాణ సముదాయాలతో బహుళ విధాలా ఉపయోగపడేలా చేయాలనుకుంటున్నట్లు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రికి వివరించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అవసరమని, అవసరమైన మద్దతు ఇవ్వాలని కేంద్రమంత్రి పురీని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద వాటిని ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయడంతో పాటు ఇవ్వాల్సిన బ్యాలెన్సు నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించాలని జల్ శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజప్తి చేశారు. జల్‌శక్తి మంత్రి షెకావత్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గురువారం సాయంత్రం కలిశారు. కరవు, ఫ్లోరైడ్ పీడిత జిల్లాలైన నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, నారాయణపేట, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల నుంచి సాగు నీరు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నుంచి ఆరు జిల్లాల పరిధిలోని 1226 గ్రామాలతో పాటు హైదరాబాద్ మహా నగరానికి తాగు నీరు సరఫరా చేయాల్సి ఉందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే పలు అనుమతులు తీసుకున్నా ఇంకా హైడ్రాలజీ, ఇరిగేషన్ ప్లానింగ్, అంచనా వ్యయం, బిసి రేషియో, అంతరాష్ట్ర అంశాలు కేంద్ర జల సంఘం పరిశీలనలో ఉన్నాయని, వాటికి వెంటనే ఆమోదం తెలపాలని కోరారు. ప్రాజెక్టు ప్రాధాన్యం దృష్ట్యా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇవ్వాలని జల్‌శక్తి మంత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు అదనపు నిధుల కేటాయింపునకు జల్‌శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సానుకూలంగా స్పందించారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. జల్ శక్తి మంత్రిని కలిసిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము పాలమూరు-రంగారెడ్డికి జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించాలని జల్‌శక్తి మంత్రిని కోరామని తెలిపారు. 2014 తర్వాత కేంద్ర ప్రభుత్వం ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించలేదని, ఈ విధానం ప్రస్తుతం అమలులో లేదని జల్‌శక్తి మంత్రి తెలిపారన్నారు. అయితే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రాధాన్యం దృష్ట్యా ఆ ప్రాజెక్టుకు తమ శాఖ పరిధిలోని మరో పథకం కింద 60 శాతం నిధులు కేటాయిస్తామని జల్‌శక్తి మంత్రి హామీ ఇచ్చారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టిఎస్‌పిఎస్సి పూర్తిగా విఫలమైందని, పేపర్ లీకులతో భ్రష్టు పట్టినందున దానిని సంస్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. టిఎస్‌పిఎస్సిని యుపిఎస్సీ తరహాలో మార్చేందుకుగానూ శుక్రవారం యుపిఎస్‌సి చైర్మన్‌తో ముఖ్యమంత్రి, తానూ సమావేశం అవనున్నట్లు ఆయన చెప్పారు.

ప్రజా పాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

పక్కాగా రూ.2 లక్షల రుణమాఫీ

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- మర్పల్లి ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు పరుస్తామని, త్వరలో రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటన చేస్తామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులు ఆరో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందుబాటులో లేని వారు తిరిగి నాలుగు నెలల తర్వాత దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. మరికొన్ని రోజుల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు రూ.1,00,116తో పాటు తులం బంగారం లేదా రూ.1.60 లక్షల చెక్కును అందజేస్తామన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలోని రోడ్ల ఏర్పాటుకు రూ.300 కోట్లు కేటాయిస్తామన్నారు. అదనంగా రోడ్ల నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వానికి రూ.150 కోట్ల మంజూరుకై ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మహేముదాబీ, ఆర్డీవో విజయ కుమారి, మండల ప్రత్యేక అధికారి అనిత, ఎంపిపి బట్టు లలిత రమేష్, జడ్‌పిటిసి మధుకర్, ఎంపిటిసి సంగీత వసంత్, తదితరులు పాల్గొన్నారు.

జూబ్లిహిల్స్ హౌసింగ్ సొసైటీ సమస్య పరిష్కరిస్తాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్ట్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, జూబ్లిహిల్స్ సమస్యలను పరిష్కరిస్తామని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గతంలో ప్రభుత్వాలు జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వెనక్కి తీసుకునే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టంచేశారు. అయితే, అక్కడక్కడ కొన్ని సమస్యలున్నాయని తమ దృష్టికి వచ్చిందని, ముందుగా వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. జర్నలిస్ట్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ నాయకులు గోపరాజు, రాజశేఖర్, భూపాల్ రెడ్డి తదితరులు గురువారం మంత్రిని మినిష్టర్స్ క్వార్టర్స్‌లో కలిశారు. సొసైటీ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సొసైటీ స్వాధీనంలో ఉన్న 9ఎకరాల భూమిని సొసైటీకి అప్పగిస్తే వందలాది మంది నాన్ అలాటీస్‌కు న్యాయం జరుగుతుందని వారు మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ, ఇప్పటికే ఈవిషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా జర్నలిస్టులకు స్పష్టమైన హామీఇచ్చారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు.

తెలంగాణ జెఎన్‌టియుహెచ్‌లో విద్యార్థుల ఆందోళన

- ఆహారంలో పురుగులొస్తున్నాయని ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాలేజీ మెస్‌లో ఫుడ్ సరిగ్గా ఉండట్లేదని.. ఆహారంలో పురుగులు, రబ్బర్లు వస్తున్నాయని మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని జెఎన్‌టియుహెచ్‌లో పిజి విద్యార్థుల గురువారం ఆందోళనకు దిగారు. జెఎన్‌టియుహెచ్ ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులంతా పెద్ద సంఖ్యలో నిరసన చేపట్టారు. ప్రిన్సిపల్ విజయ్ కుమార్‌రెడ్డి వేధింపులు ఎక్కువవుతున్నాయని, విద్యార్థినులపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. మెస్ బిల్లుల పేరిట తమ ఫలితాలను ఆపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెస్‌లో పీజీ హాస్టల్ విద్యార్థులకు భోజనం నాణ్యత లేకుండా ఇస్తున్నారని, సాంబార్‌లో చికెన్ ముక్కలు, మిగతా కూరలో రబ్బర్ బ్యాండ్లు వస్తున్నాయని.. ఎలా తినాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై ప్రిన్సిపల్‌ను అడిగితే తమ పట్ల దురుసుగా, అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రిన్సిపల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని యూనివర్సిటీ అధికారులను డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న కెపిహెచ్‌బి పోలీసులు, రిజిస్ట్రార్ విద్యార్థులను సముదాయించారు. దీనికి సంబంధించిన విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ చెప్పడంతో నిరసన విరమించారు.

అద్దె బస్సు సమస్యల పై ఉన్నత స్థాయి కమిటీ

- ఆర్‌టిసి ఎండి సజ్జనార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అద్దె బస్సు యజమానుల సమస్యల పరిష్కారం కోసం టిఎస్‌ఆర్‌టిసి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని బస్సు భవన్‌లో హైర్‌బస్సు యాజమానులతో ఆర్‌టిసి యాజమాన్యం సమావేశమైంది. ఈ సమావేశంలో ప్రధానంగా ఐదు సమస్యలను వారు సంస్థ దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై సంస్థ ఉన్నతాధికారులతో కలిసి చర్చించారు. వీటి పరిష్కారానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు టిఎస్‌ఆర్‌టిసి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ కమిటీ సిఫారసులను పరిశీలించిన తర్వాత.. ఆ మేరకు యాజమాన్యం నిర్ణయం తీసుకుంటుందని హైర్ బస్సు యాజమానులకు వివరించింది. అందుకు వారు సానుకూలంగా స్పందించారు. 'హైర్ బస్సు యాజమానులు కొన్ని అంశాలను టిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. మహాలక్ష్మి స్కీం అమలు తర్వాత ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు. సంస్థ ఉన్నతాధికారులతో కలిసి చర్చించాం. రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఒక ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఆ కమిటీ అన్ని అంశాలను శాస్త్రీయ కోణంలో పరిశీలిస్తుంది. సంస్థ బస్సులు, హైర్ బస్సుల డేటాను క్రోడికరించి.. ఒక నిర్ణయం తీసుకుంటుంది. దీనిపై హైర్ బస్సు యాజమానులు సానుకూలంగా స్పందించారు." అని ఎండి వీసీ సజ్జనర్ తెలిపారు. కాగా, ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సమ్మెను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మధుకర్ రెడ్డి తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

- 11న మానుకోటలో భారీ ధర్నా
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి. నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలం కేటాయించి ఇల్లు కట్టుకోవడానికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న మానుకోటలో మహాధర్నా నిర్వహిస్తున్నట్టు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి బానోతు సీతారాంనాయక్ అధ్యక్షతన గురువారం జరిగిన పట్టణస్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్‌లోని కురవి గేటు సమీపంలో సర్వే నెంబర్ 255/1లో గతేడాది తమ పార్టీ ఆధ్వర్యంలో ఇళ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారన్నారు. ఆ భూమిని ఆక్రమించిన భూ కబ్జాదారులు అధికారులతో కుమ్మక్కై, పేదల గుడిసెలపై 19 సార్లు జెసిబిలతో దాడులు చేసి ఇళ్లను ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులపై అనేక అక్రమ కేసులు పెట్టడంతోపాటు మహిళలని కూడా చూడకుండా వారిపైనా అనేక కేసులు పెట్టి చిత్రహింసలకు గురిచేశారని, రాత్రి వేళల్లో జైలుకు పంపించారని తెలిపారు. సిపిఎం పోరాట ఫలితంగానే భూకబ్జాదారులు ఆక్రమించిన భూమి బయటకు వచ్చిందని గుర్తు చేశారు. పేదల జోలికెళ్లిన ఏ ప్రభుత్వం మనుగడలో కొనసాగలేదన్నారు. మానుకోట జిల్లా కేంద్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆక్రమించిన ప్రభుత్వ భూములను ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను మళ్ళీ అక్రమణదారులకే కట్టబెట్టే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అక్రమించిన ప్రభుత్వ భూముల్లో తమ పార్టీ ఆధ్వర్యంలో ఎర్ర జెండాలు పాతి ఇళ్లు లేని పేదలకు పంచుతామన్నారు. సర్వే నెంబర్ 255/1లో గుడిసెలు వేసుకున్న పేదలకు జీఓ 58 ప్రకారం ఇళ్ల పట్టాలు ఇచ్చి అందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. ఈ నెల 11న స్థానిక నర్సంపేట బైపాస్ రోడ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనతోపాటు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుర్ణపు సోమయ్య, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు చిపిరి యకయ్య, పట్టణ కమిటీ సభ్యులు బానోతు వెంకన్న, తోట శ్రీనివాస్, యమగని వెంకన్న, నాయకులు బూర్గుల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం విచారణను సిబిఐకి అప్పగించొద్దు

- సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలి
- పార్టీలు, నీటిపారుదల నిపుణులతో అఖిలపక్షం నిర్వహించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ సిబిఐకి అప్పగించొద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2023, అక్టోబర్ 21న కాళేశ్వరానికి చెందిన మేడిగడ్డ ప్రాజెక్టు ఏడో బ్లాక్‌లోని 19-21 పిల్లర్లు కుంగిపోయాయని తెలిపారు. అదే సమయంలో అన్నారం ప్రాజెక్టు ముందుభాగంలో కూడా బుంగపడి నీరు బయటకు వచ్చిందని పేర్కొన్నారు. ఈ రెండు ప్రమాద ఘటనలతో అత్యంత ప్రతిష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై రాష్ట్రంలో సర్వత్రా అనేక అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమయ్యాయని తెలిపారు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అవకతవకలపై న్యాయ విచారణకు ఆదేశించిందని గుర్తు చేశారు. న్యాయ విచారణ కాకుండా సిబిఐ విచారణ చేపట్టాలంటూ బిజెపి రాష్ట్ర నేతలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. స్వతంత్ర సంస్థలైన ఇడి, సిబిఐ, ఐటి తదితర శాఖలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పావులుగా వాడుకుంటున్నదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కాళేశ్వరంపై విచారణను సిబిఐకి అప్పజెప్పడమంటే బ్లాక్‌మెయిలింగ్‌కు కేంద్ర ప్రభుత్వానికి అవకాశమివ్వడమేనని తెలిపారు. నేటికీ ప్రాజెక్టు మొత్తం వ్యయ అంచనా రూ.1.27 లక్షల కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.93 వేల కోట్లు ఖర్చు చేశారని వివరించారు. ఇందులో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి వివిధ బ్యాంకుల ద్వారా అప్పు రూ.87,449.16 కోట్లు మంజూరు కాగా, అందులో రూ.71,565.69 కోట్లు విడుదలై ఖర్చు చేశారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన ఖర్చు, నాణ్యత, నిధుల దుర్వినియోగం తదితరాలన్నింటిపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు, నీటిపారుదల నిపుణులతో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు.

మార్పును జీర్ణించుకోలేకపోతున్న బిఆర్ఎస్

- ఐదు ఎంపీ స్థానాలపై కేంద్రీకరించాం : కూనంనేని
- ఇండియా ఫోరమ్‌ను బలోపేతం చేస్తాం : నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామ్యంలో జరిగిన మార్పును, రాష్ట్రంలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి మారడాన్ని బిఆర్ఎస్ భరించలేకపోతున్నదనీ, జీర్ణించుకోలేకపోతున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెలరోజులు కాకుండానే ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతమని చెప్పారు. కొత్త ప్రభుత్వానికి కొంత సమయమివ్వాలని తాము నిర్ణయించామన్నారు. రెండురోజులపాటు జరిగిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గం, కార్యవర్గం, రాష్ట్ర సమితి సమావేశాల సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం, వరంగల్, పెద్దపల్లి, నల్లగొండ, భువనగిరి పార్లమెంటు స్థానాలపై కేంద్రీకరించామని చెప్పారు. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్, సిపిఐ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశాయని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లోనూ తమకు ఒక సీటు కావాలని కాంగ్రెస్‌ను అడుగుతామన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలకు కమిటీలను నియమించి మరింత క్రియాశీలకంగా వ్యవహారించాలని నిర్ణయించామని అన్నారు. కొంత సమయం తర్వాతే ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాటం చేస్తామని చెప్పారు. ప్రజల కోరికలు ప్రతిబింబించేలా వ్యవహరిస్తామన్నారు. జర్నలిస్టుల ఇండ్లస్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామంటూ బిఆర్ఎస్ గొప్పలు చెప్పిందనీ, అవన్నీ కాగితాలకే పరిమితమని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పట్ల అన్ని వర్గాల ప్రజల్లోనూ అసంతృప్తి ఉందన్నారు.

ఇవిఎంలపైనే బిజెపి ఆశలు : అజీజ్ పాషా

గత ప్రభుత్వంలో కేవలం ఒక కుటుంబమే రాష్ట్రాన్ని పాలించిందని సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొంత విశాల దృక్పథంతో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నదని అన్నారు. పార్లమెంట్ నుంచి ప్రతిపక్షాలను బయటకు పంపి బిజెపి ప్రభుత్వం మూడు క్రిమినల్ బిల్లులను ఆమోదించడం అన్యాయమని చెప్పారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌లో గెలిచాక వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోనూ గెలుస్తామన్న ధీమాతో బిజెపి ఉందన్నారు. ఇవితఎంలపైనే ఆశలు పెట్టుకుందని అన్నారు. అభివృద్ధి చెందిన అమెరికా, జపాన్, ఫ్రాన్స్ వంటి దేశాల్లో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతున్నాయని గుర్తు చేశారు.

పొగబాంబు బిజెపి ముందస్తు ప్రణాళిక : నారాయణ

దేశంలో 'ఇండియా కూటమి' బలపడుతున్న నేపథ్యంలోనే బిజెపి ముందస్తు ప్రణాళికలు వేస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. పార్లమెంటులో పొగబాంబు ఘటన అందులో భాగమేనని విమర్శించారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవాన్ని అడ్డంపెట్టుకుని లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు పొందాలని బిజెపి చూస్తున్నదని అన్నారు. దేశవ్యాప్తంగా తాము పది నుంచి 12 ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పారు. మాజీ సిఎం కెసిఆర్‌ను సిఎం జగన్ పరామర్శించడం రాజకీయంలో భాగమేనని అన్నారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరితే జగన్ భయపడ్డారని చెప్పారు. ఏపీలో జగన్ ప్రభుత్వం పోవాలని ప్రజలు కోరుకుంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లేని కెటిఆర్

పిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

.కాంగ్రెస్ 420 హామీలంటూ మాజీ మంత్రి కెటిఆర్ బుక్‌లెట్‌ను విడుదల చేయడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని పిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే కొలమానమని ఆయనకు తెలియకపోవడం విచారకరమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయనకు ప్రజాస్వామ్యం పట్ల చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రజల చేతిలో ఛీత్కారానికి గురై కెటిఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసి తీరుతామని తెలిపారు. కెటిఆర్ మంత్రిగా ఉన్న మున్సిపల్ శాఖలో ఆయన 420 వ్యవహారాలను త్వరలోనే బయటకు తీసుకొస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బిఆర్ఎస్ తుడిచిపెట్టుకుపోతుందని హెచ్చరించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఎంతో పరిణితి చెందిన నాయకునిగా పాలన సాగిస్తూ... గత ముఖ్యమంత్రులను మరిపిస్తున్నారని బండి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

20 వేల పోస్టులతో డిఎస్‌సిని ప్రకటించాలి

- డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్‌సి అనుబంధ నోటిఫికేషన్‌ను విడుదల చేసి షెడ్యూల్‌ను ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గత ప్రభుత్వం ప్రకటించిన 5,089 ఉపాధ్యాయ పోస్టులకు అదనంగా 15 వేల పోస్టులను కలిపి 20 వేల ఉపాధ్యాయ పోస్టులతో అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరీష్, శ్రీను నాయక్, కోటేష్, శశిధర్, శ్రీనివాస్, స్వప్న, మౌనిక గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతుల కోసం టెట్ ఆ తర్వాత బదిలీలు, కోర్ట్ కేసులంటూ కాలయాపన చేయడం వల్ల లక్షలాది మంది అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. వరుసగా ఎన్నికల కోడ్ రాబోతుందనీ, దాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టిసారించి ఆర్నెల్లలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అందుకనుగుణంగా డిఎస్‌సి అనుబంధ ప్రకటన జారీ చేయాలని సూచించారు. రాబోయే ఆర్నెల్లలో ఉద్యోగ విరమణ ద్వారా ఖాళీ అయ్యే ఐదు వేల పోస్టులు, మూతబడిన బడులను తెరవడం వల్ల మరో ఐదు వేలు, గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచినవి మరో ఐదు వేల పోస్టులు అన్ని కలిపి 20 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు అవకాశముందని వివరించారు.

IN THE COURT OF THE IIND ADDL DISTRICT JUDGE KURNOOL AT ADONI
A.S. No.6/2023.

Between:-
Smt. Jamaruth Begum. ...Appellant
Versus
J.Mohammed Hussain and 8 others, ...Respondents

NOTICE TO RESPONDENT NO.8

To,
R-8 Janda Hassian Basha, S/o. Janda Hussain Sab, Muslim, Cultivator, aged about 65 years, R/o. Peddathumbalam Village, Adoni Mandalam, Kurnool District

Whereas the above named appellant fled the above case is for Permanent Injunction suit. You are hereby order to take notice and appear before this court at 10.30 A.M. on 23/01/2024 in person or through advocate and file your objections if any. Else you will be set exparte and the above appeal will be decided in your absence.

//By Order of the Court//
Sri Y. RAMI REDDY,
Srl. M. SHAIKSHAVALI,
Advocate for appellant, Adoni.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
IA No. 43 of 2023 in O.S.NO.218 OF 2023

BETWEEN:
GOPATHI SHOBHA ... PLAINTIFF
A N D
P.SURESH And others ... DEFENDANTS

To
D-4 Kanikaram Rajkumar,
S/o. Chandrashekar, Aged about 35 years, Occ: Business R/o. H. No. 5-5-1003/15/01, Flat No. 301, Agamaiah Nagar, Chintalkunta, L.B. Nagar, Ranga Reddy District.

NOTICE

The Plaintiff had filed the above suit for Perpetual Injunction against the Defendants which includes you in respect of Suit Schedule Property mentioned therein. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to 22.01.2024 at 10.30 a.m. and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
Sd/- **D.SHYAM,**
ALLURI RAGHU RAMA AURAVA,
Advocates,
Nagole, Ranga Reddy District.

నర్సరీల్లోనే మూలుగుతున్న మొక్కలు

- 'ఆయిల్‌పామ్' సబ్సిడీ కోసం రైతుల ఎదురుచూపులు
- పెట్టుబడికి ఐదొంతల ఖర్చు
- ఆదుకోవాలని రైతుల వినతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ జిల్లాలో పామాయిల్ సాగు చేయడానికి ముందుకొచ్చిన రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఒకే నర్సరీ ఉండటం, అధికారుల లక్ష్యానికి తగ్గట్టుగా మొక్కలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాసిరకం మొక్కలతోనూ రైతులకు అవస్థలు తప్పడం లేదు. అంతేకాదు, అయిల్ పామ్ సాగుకు ఎకరానికి రూ.20 వేల ఖర్చు వస్తుండగా, ప్రభుత్వం మాత్రం రూ.4500 ఇచ్చి చేతులు దులుపు కుంటుంది. అదీ ఒక ఏడాది మాత్రమే గత ప్రభుత్వం ఇచ్చింది. మిగతా రోజుల్లో పరిస్థితులేంటని రైతుల ప్రశ్న.

జిల్లా వ్యాప్తంగా సంగెం మండలం రాంచంద్రా పురంలో ఒకే నర్సరీ ఉంది. ఆయిల్‌పామ్ దిగుబడులను సేకరించే కాంట్రాక్టును రామ్‌చరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ దక్కించుకుంది. జిల్లా పరిధిలో 2022-23కుగాను ఆరు వేల ఎకరాల సాగు లక్ష్యం కాగా 2,656 ఎకరాల్లో 761మంది రైతులు సాగు చేశారు. 2023-24కు గాను 10వేల ఎకరాల లక్ష్యం కాగా 600 మంది రైతులు 1750 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. అదనంగా 600 ఎకరాల మొక్కలు నాటేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. కాగా నర్సరీలో 6000 ఎకరాలకు మాత్రమే మొక్కలు అందుబాటులో ఉన్నాయి. అయినా రైతులు ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి చూపట్లేదు. ఎకరా ఆయిల్ పామ్ సాగులో.. నాట్లు, చదును చేసేందుకు, గుంతలు తీసేందుకు, ఎరువులు, పురుగు మందులు, కలుపు తీసేందుకు.. మొదటి ఏడాదిలోనే ఎకరానికి సుమారు రూ.20వేల పెట్టుబడి అవుతుందని రైతులు తెలిపారు. ప్రభుత్వం మాత్రం ఎకరానికి సుమారు రూ.4500 ఇస్తామని ఒప్పందం చేసుకున్నా, మొదటి ఏడాది సబ్సిడీ ఇచ్చి, రెండవ ఏడాది ఇవ్వలేదు. దాంతో ఆయిల్ పామ్ సాగు రైతులు సందిగ్ధంలో పడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ కంటే ఐదొంతులు ఎక్కువ ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కంపెనీ వారు అందజేసిన మొక్కల్లో పెరుగుదల ఉండటం లేదని, మరికొన్ని చనిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చనిపోయిన మొక్కల స్థానంలో ప్రతి ఎకరాకు 3 మొక్కలు మాత్రమే ఉచితంగా ఇస్తున్నారని, అంతకంటే ఎక్కువ మొక్కలు చనిపోతే ఒక్క మొక్కకు రూ. 193 పెట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. పెద్ద మొత్తంలో నాసిరకం మొక్కలు ఇవ్వడంతో నష్టం వస్తోందని, పెట్టుబడి మరింత ఎక్కువవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంతోనే చాలా మంది రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ఆసక్తి చూపడం లేదు. లక్షల సంఖ్యలో ఆయిల్ పామ్ మొక్కలు నర్సరీలకే పరిమితమవుతున్న పరిస్థితి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదనే ఆరోపణలొస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీ సకాలంలో అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం వెంటనే సబ్సిడీ అందచేయాలి : యాటం కుమారస్వామి (అప్పల్‌రావుపేట)

ఐదు ఎకరాలు సాగు చేస్తే మొదటి ఏడాదిలో లక్ష రూపాయల పెట్టుబడి అయింది. రెండవ సంవత్సరంలో ఎకరానికి రూ.20 వేల ఖర్చు అయ్యింది. సంవత్సరానికి రూ.4,500లు చొప్పున నాలుగేండ్ల పాటు ప్రభుత్వం సబ్సిడీ కింద ఇస్తామని ఒప్పందం చేశారు. మొదటి ఏడాది సబ్సిడీ ఇచ్చి రెండో ఏడాది సబ్సిడీ ఇంతవరకు ఇవ్వలేదు.

పెట్టుబడికి డబ్బులు లేవు : తిప్పని సుధాకర్(అప్పల రావు పేట)

నాలుగు ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటిన. కొన్ని నాసిరకం మొక్కలు ఇవ్వడంతో కొన్ని మొక్కలు చనిపోయాయి. మరికొన్ని మొక్కల్లో పెరుగుదల లేదు. కంపెనీ ఎకరానికి మూడు మొక్కలు ఉచితంగా ఇచ్చి చేతులు దులుపుకుంది. ఆపైన ఒక్కటికి సుమారు రూ.193 లు ఖర్చు పెట్టి ఒక్కొక్క మొక్కను కొన్నాను. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ కంటే పెట్టుబడి సుమారుగా 5 వంతుల ఖర్చు ఎక్కువవుతుంది.

ఆన్‌లైన్ చేయడం ద్వారా ఆలస్యం అవుతుంది : శ్రీనివాసరావు, హార్టికల్చర్ జిల్లా అధికారి

మొదటి సంవత్సరం రైతులకు సబ్సిడీ సకాలంలో అందజేశాం. ఈ ఏడాది రైతుల వివరాలు ఆన్‌లైన్ చేయడంలో ఆలస్యమయింది. వారం రోజుల్లో సబ్సిడీ రైతులకు అందజేస్తాం. కొన్ని అనివార్య కారణాల వల్ల రైతులు కొత్త మొక్కలు నాటేందుకు ముందుకు రాలేదు. ఫిబ్రవరి వరకు సమయం ఉంది. కాబట్టి మొక్కలు నాటేందుకు రైతులకు అవగాహన కల్పిస్తాం.

సిఎంను కలిసిన సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సచివాలయ అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శాలువా కప్పి సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ప్రభుత్వ పాలన ఉండాలని వారు ఆకాంక్షించారు సిఎంను కలిసిన వారిలో ఎస్ఓ శ్రీనివాస్, ఎఎస్ఓలు కెవి శ్రీనివాస్, జివిఎన్‌రావు, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

భాగ్యరెడ్డి వర్మ దళిత జన బాంధవుడు

ప్రజాశక్తి - కల్చరల్

అంబేడ్కర్ కన్నా ముందుగానే తెలంగాణ నేలపై ఆవిర్భవించిన భాగ్య రెడ్డి వర్మ దీనుల ఉద్ధరణ కోసం పోరాడిన దళిత జన బాందవుడు అని సీ పీ ఏం నాయకుడు మాజీ శాసన సభ్యుడు నంద్యాల నరసింహా రెడ్డి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై గానసభ నిర్వహిస్తున్నశతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో కార్యక్రమాలలో భాగంగా భాగ్య రెడ్డి వర్మ సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా నరసింహా రెడ్డి పాల్గొని మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల ప్రజలకు విద్య అందుబాటులోకి తేవాలన్న లక్ష్యం తో అది హింద్ విద్యాలయం ను హైదరాబాద్‌లోని చాదర్ ఘాట్ వద్ద నిర్మించి ఉచిత విద్య అందించిన భాగ్య రెడ్డి వర్మ సదా స్మరనీయులు అన్నారు. అయన నైజాం పాలిత ప్రాంతాలలో వివక్షతకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేసిన త్యాగ శీలి అనీర్ కానీ చరిత్రలో ఆయనకు తగిన గుర్తింపు రాలేదని అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గాయకుడు రామ సుబ్రహ్మణ్యం, సినీ నిర్మాత రామ సత్యనారాయణ, సమాజ సేవకుడు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'సర్వాయి పాపన్న జీవన చిత్రాలు స్ఫూర్తిదాయకం'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్వాయి పాపన్న జీవన చిత్రాలు గీత వృత్తిని ప్రతిబింబించే విధంగా స్ఫూర్తిదాయ కంగా ఉన్నాయని బిసి సంక్షేమ కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. ఆయా చిత్రాలలో కల్లుగీత కార్మిక సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను గురువారం సచివాలయంలో ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా కల్లుగీత వృత్తిలో ప్రమాదాలు నివారించే చర్యలు చేపట్టాలనీ, ప్రమాదం జరిగిన వారికి కార్పొరేషన్ నుంచి ఇవ్వాల్సిన డబ్బులు వెంటనే బాధితులకు అందేలా చూడాలని సంఘం నేతలు కోరారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు యం.వి. రమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు బోయపల్లి సుధాకర్ గౌడ్, గౌడ సంఘం నాయకులు పల్లె కిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- మేడారం జాతర ఏర్పాట్లపై ఆదేశించిన డిహెచ్ రవీందర్‌నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడారం సమ్మక్క సారమ్మ దేవతలను దర్శించు కునేందుకు వచ్చే సందర్శకులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర హెల్త్ అండ్ పబ్లిక్ సంచాలకులు రవీందర్‌నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మేడారం జాతర అధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య అధ్యక్షతన ఉమ్మడి వరంగల్ జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య అధికారుల సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతర సమయంలో అధికారుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. మేడారం జాతర ఎంతో ప్రత్యేకమైందని, జాతరకు ఇతర రాష్ట్రాల నుంచీ అధిక సంఖ్యలో సందర్శకులు వస్తుంటారని తెలిపారు. జాతర సమయంలో విధుల్లో ఉండే వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నోడల్ అధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య మాట్లాడుతూ.. మేడారం జాతరలో విధులు నిర్వహించడానికి అంతా సంసిద్ధం చేసుకుంటున్నామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్య అధికారులతో పాటు వివిధ జిల్లాల్లో పనిచేసే వైద్య అధికారులను జాతర సమయంలో ప్రత్యేక వైద్య సేవలు అందించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. గతంలో జరిగిన జాతరలను దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు జరగబోయే జాతరలో తొమ్మిది విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని అన్నారు. 2022లో జరిగిన జాతరలో రెండు లక్షల మందికి పైగా ఒపి సేవలు అందించామని, 2024లో జరిగే జాతరకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్య అధికారులు డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రమణ, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ శిరీష, డాక్టర్ అంబరీష్, ములుగు జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా వంటావార్పు

- పోరాటానికి సిపిఎం మద్దతు
- పనులు ఆపేదాక ఉద్యమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పచ్చని పంట పొలాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను నిలిపివేయాలని రెండు నెలలుగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల ప్రజలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా గురువారం గ్రామ స్వచ్ఛంద బందుకు వారు పిలుపునిచ్చారు. అన్ని వ్యాపార సముదాయాలు, పాఠశాలలు, కళాశాలలు మూసేసి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో చర్చి ఆవరణలో వంటావార్పు కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, యువకులు మాట్లాడుతూ ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా.. అక్రమంగా వ్యవసాయ భూముల్లో ఫ్యాక్టరీ పనులు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమల స్థాపనను స్వాగతిస్తున్నాం.. కానీ పంట పొలాల్లో ఫ్యాక్టరీ స్థాపించడం సరికాదని అన్నారు. గోదావరి తీర ప్రాంతంలో నిర్మిస్తున్నందున నదీ జలాలు కలుషితమై జలచర జీవులు అంతమవుతాయని, వన్య ప్రాణుల జీవనానికి ముప్పు వాటిల్లుతుందని వాపోయారు. ప్రభుత్వం దిగొచ్చి ఫ్యాక్టరీ పనులు నిలిపేయాలని, లేదంటే ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా పోరాటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, నాయకులు బరకుంట గంగారాం, చందుల సాయికిరణ్ మద్దతు తెలిపారు. వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గం నూతన్‌కుమార్ మాట్లాడుతూ ఇథనాల్ పరిశ్రమతో ఈ ప్రాంత రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోతారని, పరిశ్రమను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా రైతాంగం ఈ పోరాటంలో పాల్గొనడం మంచి పరిణామమని అన్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఈ పోరాటానికి మద్దతుగా నిలిచి పరిశ్రమను రద్దు చేయించే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, రైతులు పోరాటాన్ని బలపరుస్తూ జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ ప్రాంతంలో బుధవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు లాఠీచార్జి చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో గురువారం ఆందోళనకారులు వంటావార్పు, బంద్ చేపట్టడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు ఎన్‌హెచ్ 61 రోడ్డు పక్కన భోజనాలు చేశారు.

సబ్ పోస్టాఫీస్‌లో రూ. 1.5 కోట్లు మాయం

- బాధితుల ఆందోళన
- గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన
- సత్వరమే పరిష్కారం చూపాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో ఉన్న సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ఖాతాదారుల ఖాతాలో నగదు మాయమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోస్ట్ ఆఫీస్‌లో సబ్ పోస్టుమాస్టర్‌గా అప్పట్లో విధులు నిర్వహించిన రామకృష్ణ చేతివాటం ప్రదర్శించి రూ.కోటీ 50 లక్షలు మాయం చేశాడని ఆరోపిస్తూ గురువారం హిల్ కాలనీలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ ఎదుట బాధితులు ఆందోళనకు దిగారు. ఏడాదికి పైగా ఖాతాదారుల నగదు మాయం చేస్తున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నగదు మాయంపై ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

ఖాతాలో నగదు మాయమైందనే విషయం తెలిసి 20 రోజులు గడుస్తున్నా పోస్టల్ అధికారులు పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామకృష్ణపై గతంలో ఫిర్యాదు చేసినా పోస్టు ఆఫీస్ ఉన్నతాధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. తమ నగదును మాయం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించి, నగదు తమకు ఇప్పించాలని డిమాండ్ చేశారు.

ఇలా వెలుగులోకి వచ్చింది..

పైలాన్ కాలనీలోని సబ్ పోస్ట్ ఆఫీస్‌లో సబ్ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేసిన రామకృష్ణ రెండేండ్ల నుంచి ఖాతాదారులు దాచుకునే డబ్బులను పాస్ పుస్తకాలు, ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు. ఏదో ఒక సాకు చెప్పడంతోపాటు కంప్యూటర్ పనిచేయడం లేదని, తర్వాత రాసి ఇస్తానంటూ ఖాతాదారులను నమ్మించాడు. ఖాతాదారులు అతనిపై నమ్మకంతో డబ్బులు చెల్లించి వెళ్లేవారు. అయితే కొద్ది రోజులుగా సబ్ పోస్ట్ మాస్టర్ రామకృష్ణ సెలవులో ఉండటంతో అతని స్థానంలో ఇన్‌చార్జిగా మరో సబ్ పోస్టుమాస్టర్ రంగయ్య బాధ్యతలు తీసుకున్నారు. ఈ క్రమంలో పోస్ట్ ఆఫీస్‌లో తాము జమ చేసిన నగదుకు.. ఖాతాలో ఉన్న నగదుకు తేడా ఉండటంతో ఖాతాదారులు రంగయ్యకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మదన్మోహన్ పోస్ట్ ఆఫీస్ రికార్డులను పరిశీలించిన తరువాత డబ్బు మాయం అయినట్టు నిర్ధారణకు వచ్చారు.

సత్వరమే పరిష్కారం చూపాలి : బాధితుడు మధు

నా ఖాతాలో రూ.2,70,000 జమ చేస్తే.. ఇప్పుడు ఖాతాలో 1,20,000 రూపాయలు మాత్రమే ఉన్నట్టు చూపిస్తోంది. పోస్టల్ అధికారులను అడిగితే విచారణ జరుగుతుందని, హెడ్ ఆఫీస్‌కు వెళ్లాలని.. అక్కడ చూస్తారని చెబుతున్నారు. పోస్టల్ అధికారుల నుంచి ఎలాంటి సమాధానాలూ రావడం లేదు. దాచుకున్న డబ్బులు పోవడంతో కొంతమంది మానసికంగా కుంగిపోతున్నారు. వెంటనే పై అధికారులు స్పందించి పరిష్కారం చూపాలి.

పోస్ట్ ఆఫీస్‌లో దాచుకున్న : బాధితురాలు రత్నమ్మ

మా పిల్లలను కూడా నమ్మకుండా పోస్ట్ ఆఫీస్‌ను నమ్ముకుంటే ఇలా ద్రోహం చేశారు. 1,36,000 పోస్ట్ ఆఫీస్‌లో దాచుకున్న. ఆరోగ్యం బాగా లేనప్పుడు అవసరానికి వస్తుందని దాచిన డబ్బును ఇలా కాజేశారు. పై అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

స్కూలు బస్సు చక్రాల కింద పడి చిన్నారి మృతి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హబ్సిగూడలో ఘటన
- విద్యార్థి సంఘాల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్నను స్కూల్ బస్సు ఎక్కించేందుకు నాన్నతోపాటు బయటకు వచ్చిన చిన్నారి.. ప్రమాదవశాత్తు అదే బస్సు చక్రాల కింద పడి నలిగిపోయింది. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హబ్సిగూడలో గురువారం జరిగింది. ఇందుకు సంబంధించి ఒయు ఇన్‌స్పెక్టర్ అంజనేయులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హబ్సిగూడలోని రవీంద్రనగర్ కాలనీలో మిథున్ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నారు. అయన కుమారుడు స్థానికంగా ఉండే జాన్సన్ స్కూల్‌లో చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం మిథున్ కుమారుడిని స్కూలు బస్సు ఎక్కించి డ్రైవర్‌తో మాట్లాడుతుండగా అదే సమయంలో అమ్మమ్మతో కలిసి బయటే ఉన్న ఆయన కుమార్తె జాహ్నా(17 నెలలు) అకస్మాత్తుగా నాన్న దగ్గరికి వెళతాను అని పరుగులు తీసింది. అది గమనించని బస్సు డ్రైవర్ వాహనాన్ని ముందుకు పోనివ్వడంతో టైర్ల కింద పడి చిన్నారి అక్కడికక్కడే ప్రాణం కోల్పోయింది. విషయం తెలుసుకున్న ఒయు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చిన్నారి మృతదేహాన్ని గాంధీ అస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే పాప చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు హబ్సిగూడ జాన్సన్ గ్రామర్ స్కూల్ ఎదుట ఆందోళన చేపట్టారు. చిన్నారి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉచిత విద్య అందించాలని, జాన్సన్ గ్రామర్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని కోరారు. విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పిన బిఆర్ఎస్ నాయకుడు..

- చెప్పుతో దేహశుద్ధి చేసిన మహిళ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగం ఇప్పిస్తానని ఓ మహిళకు మాయమాటలు చెప్పిన బిఆర్ఎస్ నాయకుడికి చెప్పుతో దేహశుద్ధి చేసింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో గురువారం వెలుగులోకి వచ్చింది. సదాశివపేట పట్టణానికి చెందిన ఓ యువతికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆత్మకూరు నాగేష్.. ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించసాగాడు. దాంతో ఆమె ఆత్మకూరు నాగేష్‌ను తన ఇంటికి పిలిపించి చెప్పుతో దేహశుద్ధి చేసింది. గతంలోనూ ఉద్యోగాలు ఇప్పిస్తానని తన పుట్టినరోజున ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో జాబ్‌మేళా నిర్వహించినట్టు సమాచారం. అప్పటినుంచి అతను అమ్మాయిలకు ఎరవేసి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని పలువురు ఆరోపించారు.

పేదల జోలికొస్తే తాట తీస్తాం

- దానం అనుచరులను అరెస్టు చేయాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదని, తాట తీస్తామని, ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరులను తక్షణం అరెస్టు చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. హైదరాబాద్‌లోని బేగంపేట్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో పేదల నివాసాలే లక్ష్యంగా ఇళ్లను కూల్చేసిన ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు సిపిఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ బేగంపేట్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో పేదల ఇళ్లను కూల్చిన ప్రాంతాన్ని గురువారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇటి నరసింహ, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి స్టాలిన్, సనత్‌నగర్ నియోజకవర్గం కార్యదర్శి ఎండి సలీంఖాన్‌తో కలిసి నారాయణ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. ఆరు నెలలుగా ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరులు తమ ఇళ్ల వద్ద తిష్టవేసి భయభ్రాంతులకు గురిచేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారని గోడు వెళ్లబోసుకున్నారు. తమ ఇండ్లను కూల్చేసి ఇక్కడి నుంచి తరిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఇక్కడే జాగలు కొని 40 ఏళ్ల నుంచి నివాసముం టున్నామని తెలిపారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ ఇళ్లు కూల్చేయబడిన సుమారు 50 మంది బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత పోలీస్ అధికారులపై ఉందన్నారు. పేదలపై భూకబ్జాదారులు దౌర్జన్యాలకు పాల్పడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆ ప్రాంతంలో తిరిగి ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. బాధితులకు తగిన రక్షణ కల్పించాలని సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు ఇంతియాజ్ ఖాన్, సైఫ్‌ఖాన్, జావీద్, వెంకటేష్, దశరథ్ తదితరులు ఉన్నారు.

కూల్చివేసిన ఇళ్లను పరిశీలించి మాట్లాడుతున్న నారాయణ

అంధుల సంక్షేమం కోసం కృషి చేయాలి

- బ్రెయిలీ జయంతి సభలో అడివయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంధుల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయటమేగాక, ప్రత్యేక లిపిని కనిపెట్టి, అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేష్ తెలిపారు.

అంధుల అక్షర ప్రధాత లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి సందర్బంగా గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన జయంతి సభను ఆర్ వెంకటేష్ అధ్యక్షతన జరిగింది.లూయిస్ బ్రెయిలి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ 1809 జనవరి 4 న పారిస్ దగ్గరలోని "క్రూవే" గ్రామంలో మోనిక్ బ్రెయిలీ, సైమన్ రెనె బ్రెయిలీ దంపతులకు జన్మించారాని తెలిపారు. బాల్యంలో ప్రమాదవశాత్తు రెండు కండ్లు కోల్పోయి, అంధుడిగా మారినరనీ, పారిస్‌లో 1784లో వాలెంటైన్ హ్యూ ప్రారంభించిన అంధుల పాఠశాలకు బ్రెయిల్ చదువుకున్నారని చెప్పారు. ప్రతి ఏటా ఏప్రిల్ 1-7 వరకు దేశవ్యాప్తంగా అందత్వ నివారణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రూ.1125.70 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించి రూ.283.87కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు. గొప్పగా నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చడంలో మన పాలకులకు అందత్వ నిర్మూలన పట్ల వారికున్న చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థం అవుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందుల కోసం ప్రత్యేకంగా విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సామూహిక ప్రాంతాల్లో బ్రేయిలీ లీపి అందుబాటులో ఉంచాలన్నారు.

అన్ని రకాల అందత్వం కలిగిన వారికి వైకల్య ధృవీకరణ పత్రాలు జారి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సమాచారం, జీవోలు, చట్టాలు బ్రేయిలీ లీపిలో ముద్రించి అందుబాటులోకి తేవాలని కోరారు. అందత్వం కలిగిన వారికి పౌష్టిక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు మహమ్మద్ యూసుఫ్, నాయకులు వరప్రసాద్, రాజు, నర్సింగ్, ఉష, విజయ తదితరులు పాల్గొన్నారు.